


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఆర్ట్ ఆఫ్ డయింగ్

**డాక్టర్ కోసం** అసహనంగా ఎదురు చూస్తున్న జగదీష్‌కి విసుగ్గా ఉంది. 'పదకొండింటికి కలుస్తారా?' అని రిసెప్షనిస్ట్ అడిగినప్పుడు సరేనని పదిన్నరకల్లా హాస్పిటల్‌కి వచ్చాడు. పన్నెండు దాటుతోంది. డాక్టర్ ఇంకా పిలవలేదు. పావుగంటకి "మిస్టర్ జగదీష్" రిసెప్షనిస్ట్ పిలిచింది.

లేచి కన్సల్టింగ్ రూంలోకి వెళ్ళాడు. డాక్టర్ సానుభూతిగా చూస్తూ చెప్పాడు.

"కూర్చోండి"

"ఇప్పుడు బానే వున్నాను" కూర్చుంటూ చెప్పాడు.

"ఐ యాం సారీ జగదీష్" డాక్టర్ ఉపోద్ఘాతంగా చెప్పాడు.

జగదీష్ ప్రశ్నార్థకంగా చూసాడు.

"మీ గుండె బాగా పాడైంది. ఇంకా నాలుగైదు నెలలు. అంతే" డాక్టర్ తగ్గు స్వరంతో చెప్పాడు.

జగదీష్ అదిరిపడ్డాడు.

"ఏమంటున్నారు?" అయోమయంగా అడిగాడు.

డాక్టర్ ఏదో పొడుగాటి పేరు చెప్పి చెప్పాడు.

"ఈ ప్రాబ్లమ్‌కి మందులు కాని, సర్జరీకాని లేవు జగదీష్. వీలునామాలాంటిది రాయాలనుకుంటే, ఆ వ్యవహారాలు చూడండి."

"కానీ నాకు నలభై రెండేళ్ళే. ఆ రోజు వచ్చిన అనీజీనెస్ పూర్తిగా తగ్గిపోయింది కూడా" జగదీష్ నమ్మలేనట్టుగా చెప్పాడు.

"ఇది కొంచెం అరుదైన జబ్బే జగదీష్. మీరు హాస్పిటల్‌కి వచ్చారు కాబట్టి తెలిసింది. చాలామంది తెలుసుకోకుండానే పోతారు. కావాలంటే మీరు సెకండ్ ఒపీనియన్ తీసుకోవచ్చు" డాక్టర్ నిదానంగా చెప్పాడు.

జగదీష్ లేచి నెమ్మదిగా బయటకి నడిచాడు. అతనికి నమ్మశక్యం కావడం లేదు. తను గుండ్రాయిలా ఉన్నాడు. నలభై రెండేళ్ళు. అప్పుడే పోవడం ఏమిటి? వారం క్రితం కొద్దిగా కళ్ళు తిరిగి అనీజీగా ఉంటే హాస్పిటల్‌కి వెళ్ళాడు. డాక్టర్ అరడజను టెస్ట్‌లు రాస్తే, డబ్బులు కోసం అనుకుని నవ్వుకున్నాడు. చివరికి ఇంత పెద్ద జబ్బుని చెప్పాడేంటి?

బయటకి వచ్చాడు. హాస్పిటల్ గేట్ పక్కనే కొబ్బరి బోండాల బండివుంది. చుట్టూ గుంపుగా జనం. ఆ బండబ్బాయ్ చకచక కాయలు కొట్టి స్ట్రా వేసి ఇస్తున్నాడు.

అతన్ని చూడగానే జగదీష్‌కి కలిగిన ఆలోచన.

"ఆరు నెలల తర్వాత వాడుంటాడు. కాని నేనుండను."

జగదీష్ సెకండ్ ఒపీనియన్ తీసుకోదల్చుకోలేదు. ఆ డాక్టర్ మీద అతనికి నమ్మకం ఉంది. ఇంటికి వచ్చాక నిస్సత్తువుగా మంచం మీద వాలిపోయాడు. పెద్ద పెట్టున ఏడుపు వచ్చింది. దాదాపు అరగంటసేపు ఏడ్చాక తెప్పరిల్లాడు. అతనికి భయంగా ఉంది. ఎవరితోనైనా ఆ బాధని పంచుకోవాలని వుంది. కానీ ఎవరూ లేని శూన్యమైన ఇల్లు ఇంకాస్త భయపెడుతోంది.

'తలనొప్పికే భయపడతావే రాజా' నిరతి కిలకిల నవ్వులు గుర్తొచ్చాయి.

అతను మొదటగా చేసిన పని ఉద్యోగానికి సెలవు పెట్టడం.

"నాలుగు నెలలా? ఇంత లాంగ్ లీవ్ ఎందుకు? ఏ దేశమైనా వెళ్తున్నారా?" బాస్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ప్రపంచ యాత్ర చేద్దామని" జగదీష్ నవ్వకుండా చెప్పాడు. నమ్మిన బాస్ సెలవు శాంక్షన్ చేసాడు.

మధ్యాహ్నం ఇంటికి వచ్చాక ఏం చేయాలా అని ఆలోచించాడు. 'వీలునామాలాంటిది రాయండి' డాక్టర్ మాటలు గుర్తొచ్చాయి.

అవును. తనకి చాలా ఆస్థిపాస్తులున్నాయి. ఎవరికి రాయాలి?

తనకి తెలిసిన వాళ్ళగురించి ఆలోచించాడు. అందరూ దుర్మార్గంగానే అనిపించారు. చూస్తూ చూస్తూ కోట్లాది ఆస్థిని వారికివ్వాలనిపించలేదు.

అకస్మాత్తుగా జగదీష్‌క్ నాలుగైదు నెలలక్రితం ఆఫీస్‌లో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది.

మిస్టర్ నో ఆల్ అని ముద్దుపేరు పెట్టిన ఉద్ధవ్ తను తెలుసుకున్న కొత్త విషయం గురించి, ఆరోజు లంచ్‌లో ఉత్సాహంగా చెప్పాడు.

"మనందరికీ ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురించి తెలుసు. కాని టిబెటియన్ మాంక్స్ ఆర్ట్ ఆఫ్ డయింగ్‌ని ప్రాక్టీస్ చేస్తారు తెలుసా?..."

అతను చాలా విషయాలు, పద్ధతులు చెప్పాడు. అంతా ఏదో కథ విన్నట్లుగా విన్నారు కాని పెద్దగా పట్టించుకోలేదు.

ఆర్ట్ ఆఫ్ డయింగ్.

తనెందుకు దాన్ని ప్రాక్టీస్ చేయకూడదు? అనుకున్నాడు.

ముందుగా తను హర్ట్ చేసినవాళ్ళకి క్షమాపణలు చెప్పాలి. పశ్చాత్తాపం ప్రకటించాలి.

జగదీష్ పెన్, పేపర్ తీసుకుని లిస్ట్ రాయసాగాడు.

1. పనిమనిషి – సరిగ్గా దుమ్ముతుడవడం లేదని, బాత్‌రూంని శుభ్రంగా కడగడంలేదని రెండు రోజుల క్రితం బాగా తిట్టాడు.

2. చంద్రపాల్– ఆఫీస్‌లో తనకి రిపోర్ట్ చేస్తాడు. మీటింగ్‌లో శ్రద్ధగా లేడని, ఫోన్ చూసుకుంటున్నాడని కటువుగా చెప్పాడు. ఆయన చిన్నబుచ్చుకుని మౌనంగా ఉండిపోయాడు.

3. ట్రాఫిక్ పోలీస్– స్కూల్ జోన్ అని, స్పీడ్‌గా వెళ్ళొద్దని హెచ్చరించాడని ఇంగ్లీషులో తిట్టి వెళ్ళిపోయాడు. కానీ ఇతని పేరు, వివరాలు తెలియవు.

ఈ విధంగా దాదాపు డజన్ పేర్లు రాసాడు. పనిమనిషిలాంటి పేదవాళ్ళకి తలో పాతికవేలు ఇద్దామనుకున్నాడు.

లేచి వెళ్ళి కాఫీ కలుపుకుని వచ్చి కూర్చుని మరోసారి ఆ లిస్ట్ చూసాడు.

"జగ్గీ నువ్వేం చేస్తున్నావో నీకు తెలుస్తోందా?" శ్రీనాథ్ తీవ్రంగా అడగడం. గుర్తొచ్చింది.

శ్రీనాథ్!

చిన్నప్పటి తన స్నేహితుడు. స్కూలవగానే తనతో తమ ఇంటికే వచ్చి జామచెట్టు ఎక్కేవాడు.

"నీకిదేం పిచ్చిరా? పిందెలతో సహా నమిలేస్తున్నావు? ఉండు మీ అమ్మకి చెప్తాను" తాతయ్య లబలబలాడేవాడు.

అరగంట ఆడుకున్నాక, వాళ్ళమ్మ ఏ పదోసారో పిలిచాక వాళ్ళింటికి వెళ్ళేవాడు. తెలివిగలవాడైన శ్రీనాథ్ పరీక్షల్లో తనకి పేపర్ చూపించేవాడు. తనకి తోడునీడగా ఉండేవాడు. తల్లితండ్రులు లేనివాడని వాళ్ళమ్మ ఆదరంగా అన్నం పెట్టేది. తాతయ్యపోయాక తనకి మిగిలిన ఏకైక ఆప్తుడు. అంత ప్రాణ స్నేహితుడు కూడా నిరతి విషయంలో తనని వ్యతిరేకించి శత్రువయ్యాడు.

నిరతి!

'రేయి మించెనోయ్ రాజా! హాయిగ నిదురించరా' సన్నటి గొంతుతో జోలపాట పాడే నిరతి.

అందరిలా తనని జగ్గీ, జగ్గూ అనికాక 'రాజా' అని ముద్దుగా పిలుచుకునే నిరతి.

జగదీష్ తొలిసారి నిరతిని ఇంజనీరింగ్ కాలేజెస్ కౌన్సిలింగ్ రోజు చూసాడు. 'ఎంత బాగుందో ఈ అమ్మాయి. ఏ కాలేజ్ సెలక్ట్ చేసుకుంటుందో' అనుకున్నాడు.

క్లాసెస్ ప్రారంభమయ్యాక తన బ్రాంచ్‌లో తన క్లాస్‌లోనే ఆమెని చూడగానే ఆనందంతో పరవశించిపోయాడు. క్రమంగా ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. నాలుగేళ్ళలో స్నేహం ప్రేమైంది.

ప్రేమికులుగా ఉన్న రోజుల్లో ఓసారి ఆమెతో చెప్పాడు.

"నాకు రాజా అనే పేరు ఎంతిష్టమో. జగదీష్ అనే పేరు అసలు ఇష్టంలేదు."

"ఎందుకలా? నిరతి ఆశ్చర్యంగా అడిగింది.

"మా అమ్మ నన్ను 'చిన్న రాజా' అని పిలిచేదట. నేను ఏడుస్తూంటే, 'మా బుజ్జి రాజాకి ఆకలైందమ్మా' అని ముద్దులాడేదట తాతయ్య చెప్పాడు. నేను పుట్టిన ఏడాదికే అమ్మా నాన్నా ఏదో పెళ్ళికి వెళ్ళొస్తూ ఏక్సిడెంట్‌లో పోయారు. నన్ను తాతయ్య దగ్గర వదిలివెళ్ళారు. లేకుంటే నేనూ పోయేవాడ్ని."

నిరతి అప్రయత్నంగా అతని చెయ్యి పట్టుకుని చెప్పింది.

"వద్దొద్దు. అలాంటి మాటలు మాట్లాడొద్దు రాజా."

ఎలాంటి వ్యతిరేకతలు, కష్టాలు లేకుండా వారి పెళ్ళయింది.

"నువ్వు జాబ్ చేయద్దు నిరతీ. నేను వచ్చేసరికి నాకు ఎదురొస్తూండు. నాకు ఊహ తెలిసాక ఇంట్లో ఒకమ్మాయి తిరగడం ఇదే ఫస్ట్ టైం. ఎంత బావుందో" మొదటివారం చెప్పాడు.

నిరతి ఇబ్బందిగా చూసింది.

"పోనీ ఒక ఆర్నెల్లు తర్వాత జాబ్‌లో చేరు. ఈ ఆర్నెల్లు మాత్రం నాకోసం, కేవలం నాకోసమే నువ్వు" జగదీష్ వేడుకున్నాడు.

నిరతి అతని నుదుటిమీద సున్నితంగా చుంబించి చెప్పింది "చిత్తం రాజా."

ఓ రోజు జగదీష్ ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా సందడిగా ఉంది. నిరతి అన్నయ్య వదిన, వారి పిల్లలు ఇల్లంతా తిరిగేస్తూ పెద్ద గొంతులతో మాట్లాడుకుంటున్నారు.

మర్యాద కోసం పదినిమిషాలు వారితో మాట్లాడి తన గదిలోకి వెళ్ళిపోయాడు. ఇంకో గంటకి వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఎందుకొచ్చారు వీళ్ళంతా?" తలుపు గడియపెడుతున్న నిరతిని అడిగాడు.

"మన పెళ్ళయ్యాక రాలేదుగా? ఎలా ఉన్నామో చూసిపోదామని వచ్చారు. ఐనా ఇదేం ప్రశ్న?" నిరతి ఆశ్చర్యంగా అడిగింది.

"ఏమో! నాకు ఇష్టం ఉండదు. నీకు చెప్పానుగా. నువ్వు నా కోసమే అచ్చంగా నాకోసమే ఉండాలి. నాతోనే మాట్లాడాలి. నన్నే ప్రేమించాలి. నీ ప్రతీ నిమిషం నాగురించే ఆలోచించాలి" జగదీష్ ఉద్వేగంగా చెప్పాడు.

"మేన్ ఈజె సోషల్ యానిమల్. మనిషి సంఘజీవి. నాకు మనుషులు కావాలి. నీకు తెలుసు. నాకు కాలేజ్‌లో ఫ్రెండ్స్ ఎవరూ లేరు. కానీ నాకు నా ఫేమిలీనే బెస్ట్ ఫ్రెండ్స్. అన్నయ్య, వదిన, అత్త, మామయ్య అంతా సెలవురోజుల్లో కలిసి ఎన్ని కబుర్లు చెప్పుకుంటామో. ఇప్పుడు కూడా వాళ్ళని డిన్నర్ చేసి వెళ్ళమంటే, మొహమాటపడి వెళ్ళిపోయారు" నిరతి చెప్పింది.

"అంటే, వాళ్ళు మళ్ళీ, మళ్ళీ వస్తూంటారా?" కోపంగా అడిగాడు.

"అవును. వాళ్ళు వస్తారు. మనం కూడా అప్పుడప్పుడూ వెళ్దొద్దాం" నిరతి ఉత్సాహంగా చెప్పింది.

"నాకిష్టంలేదు. వాళ్ళు రావడం ఇష్టంలేదు. నువ్వు వెళ్ళడం అంతకన్నా ఇష్టంలేదు" కటువుగా చెప్పాడు.

నిరతి నిర్ఘాంతపోయింది.

"అదేంటి? పెళ్ళవగానే పుట్టింటితో సంబంధం తెంచేసుకోవాలా?"

"అవును నాకు మనుషులంటే చిరాకు. నా ఇంట్లో నేను, నువ్వు మాత్రమే ఉండాలి. శ్రీకి తప్పించి ఇంకెవరికీ అనుమతిలేదు. వాడు కూడా చిన్నప్పటినుంచి వచ్చేవాడు కాబట్టి భరించొచ్చు. అంతే."

"మరి ఈ విషయం పెళ్ళికి ముందే ఎందుకు చెప్పలేదు?" నిరతి రౌద్రంగా అడిగింది.

"నీకూ నాకులా పేరెంట్స్ లేరంటే, మనం ఒకరికొకరం అనుకున్నా. నీ వెనక ఇంత గుంపువుంటుందని నాకెలా తెలుసు?"

"గుంపా?"

"మరి? పనీపాట లేకుండా అలా వచ్చేయడమేనా? ప్లీజ్ నిరతి నిన్ను ఇంకొకరితో షేర్ చేసుకోలేను. అసలు నాకు చిన్నప్పటినించి షేరింగ్ నచ్చదు. శ్రీనాథ్ కి కూడా ఆ విషయం బాగా తెలుసు. అందుకే వాడు నాతో తప్ప ఎవరితో ఫ్రెండ్ షిప్ చేయలేదు. నువ్వూ అలాగే ఉండాలి"

జగదీష్ తాతయ్యగదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

మర్నాడు నిరతి మొహం కళ తప్పి ఉండడం గమనించాడు కాని పట్టించుకోలేదు. ఆఫీస్ నించి శ్రీనాథ్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

"ఈవినింగ్ ఒకసారి ఇంటికిరారా"

జగదీష్ ఇంటికి వెళ్ళేసరికే శ్రీనాథ్ వచ్చి ఉన్నాడు. నిరతి వంటగదిలో ఉంది.

"శ్రీ నువ్వు చెప్పరా. మా ఇంటికి ఇన్నేళ్ళలో ఒక్క చుట్టమైనా రావడం చూసావా?" అతని ఎదురుగా కూర్చుంటూ అడిగాడు.

శ్రీనాథ్ పెద్దగా నవ్వాడు.

"నువ్వు, మీ తాతయ్య ఎవరితోనైనా మాట్లాడితేగా చుట్టాలు వచ్చేది? నేను తప్ప మీ ఇంటికి మరొకరు రాలేదు."

"అది చెప్పు నిరతికి. నిన్న ఓ పటాలం వచ్చింది మా ఇంటికి. ఊరుకుంటే రేపు ఇంకో గుంపు రావచ్చు. నాకు నిరతితో తప్ప వారెవరితో మాట్లాడడం ఇష్టంలేదు. తను వాళ్ళిళ్ళకి వెళ్ళడం కూడా ఇష్టంలేదు" కఠినంగా చెప్పాడు.

అవమానంతో నిరతి మొహం ఎర్రబడింది.

"అదేంట్రా? పెళ్ళయిపోయిందని వాళ్ళందరితో సంబంధాలు ఎలా తెంచుకుంటుంది? కొత్త చుట్టాలతో ఇల్లు కళకళలాడుతోంది అనుకోవాలి నువ్వు. ఇంతకాలం మీ తాతయ్య ఎవరు ఇంటికి వచ్చినా, ఎవరు పలకరించినా, మీ ఆస్తి కొట్టేయడానికో, మీ డబ్బు కాజేయడానికో వచ్చారని భయపడేవాడు. ముసలాయన, చాదస్తం అనుకుందాం. నీకేమైంది? మనుషులు లేకుండా ఎలా బతుకుతారు చెప్పు?" శ్రీనాథ్ అనునయంగా చెప్పాడు.

"వద్దు. నాకు మనుషులు వద్దు. నిరతి ఒక్కటీ చాలు. ఇంకోమాట మాకు పిల్లలు కూడా ఒద్దు. నిరతి వాళ్ళని ముద్దు చేస్తూ నన్ను ఇగ్నోర్ చేస్తే భరించలేను" జగదీష్ అరిచాడు.

నిరతి తెల్లబోయింది. "పిల్లలు కూడా వద్దా?"

"వద్దు. నాకు నువ్వు. నీకు నేను."

"ఏమ్మాట్లాడుతున్నావో అర్థమౌతోందా? శ్రీనాథ్ గద్దించాడు.

"బాగా"

"పెళ్ళికి ముందే ఇది ఎందుకు చెప్పలేదు?" నిరతి కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

"లక్షసార్లు చెప్పాను. నాకు నువ్వు నీకు నేను అని."

"అది ప్రతి ప్రేమికుడూ చెప్పేదే, కాని ఇలా ఇంటికి మనుషులు రాకూడదు. పిల్లలు పుట్టకూడదు లాంటివి."

"ప్రత్యేకంగా చెప్పేదేముంది? అది నేచురల్" తాపీగా చెప్పాడు.

"అది నేచురలా? నువ్వు అన్నాచురల్" నిరతి ఆక్రోశంగా చెప్పింది.

"నువ్వేమన్నా అనుకో"

"నావల్లకాదు"

"అందర్ని మర్చిపోయేలా నా ప్రేమలో నిన్ను ముంచేస్తాను నిరతీ" ఆప్యాయంగా చెప్పాడు.

"నేను వెళ్తాను" శ్రీనాథ్ ఇబ్బందిగా చెప్పిలేచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి జగదీష్ గుండెల మీద తలపెట్టుకుని పడుకున్న నిరతి నెమ్మదిగా చెప్పింది.

"నాకు భయంగా ఉంది రాజా."

ఆమె కన్నీరు ఆచ్ఛాదన లేని అతని ఛాతీని తడుపుతోంది.

"ప్రేమ రాహిత్యంతో ఎంతమంది భార్యలు గుప్పెడు ప్రేమ కోసం భర్తలని అడుక్కుంటారో తెలుసా? అలాంటిది నువ్వే నా ప్రపంచం అంటూంటే భయపడుతున్నావా? అది ఆనందిచాల్సిన విషయం" ఆమె కన్నీళ్ళు తుడుస్తూ చెప్పాడు.

ఆ తరవాతి వారం రోజులు నిరతి ముభావంగా ఉంది. ఎనిమిదోరోజు జగదీష్ ఇంటికి వచ్చేసమయానికి ఆమె ఇంట్లో లేదు. సోఫాలో ఓ ఉత్తరం కనిపించింది.

**రాజా!**

మీతో భవిష్యత్తుని తలచుకుంటే భయంవేస్తోంది. ఈ అతి ప్రేమకంటే ప్రేమ రాహిత్యమే నయమేమో అనిపిస్తోంది. సారీ. వెళ్ళిపోతున్నాను - **నిరతి.**

జగదీష్ నిశ్చేష్టుడయ్యాడు. నాలుగేళ్ళ ప్రేమని తెంచుకుని ఆమె అలా వెళ్ళిపోతుందని అతను ఊహించలేదు. ఇంత ప్రేమించే తనని కోట్లాది డబ్బుని ఆ మిడిల్ క్లాస్ మనుషులకోసం వదిలి వెళ్ళిపోతుందనుకోలేదు.

శ్రీనాథ్‌కి ఫోన్ చేసాడు.

"ఇది నేను అనుకుంటూనే ఉన్నాను" పావుగంటలో వచ్చిన శ్రీనాథ్ చెప్పాడు.

"అనుకున్నావా? ఇలా వదిలేసిపోతుందని ఊహించావా?" జగదీష్ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ముందే చెపితే నువ్వు పోనిస్తావా? గదిలో పెట్టి బంధించవూ? స్వేచ్ఛ కంటే, నీ ప్రేమ, డబ్బు గొప్పవేం కాదు."

"వాటి గొప్పదనం నీకేం తెలుసు? జామపిందెలు కూడా నమిలేసిన పేదరికం నీది" జగదీష్ ఈసడింపుగా చెప్పాడు.

"జగ్గీ నువ్వు వింతగా బిహేవ్ చేస్తున్నావు. మనుషులతో మసలడం నేర్చుకో. నిరతికి క్షమాపణ చెప్పి తీసుకురా. పిల్లా పాపలతో హాయిగా బతుకు. పంతాలకి పోయి ఒక్కడివే ఉంటే నీ పిచ్చి ఇంకాస్త ముదురుతోంది" శ్రీనాథ్ సానుభూతిగా చెప్పాడు.

"ఈ జన్మలో జరగదు" జగదీష్ అరిచాడు.

నిరతి నించి వచ్చిన విడాకుల పత్రాల మీద జగదీష్ సంతకం పెట్టలేదు. ఆమె నించి మళ్ళీ ఎలాంటి ప్రయత్నం లేదు.

నిరతి వెళ్ళిన మొదటి నెలరోజులూ జగదీష్ నరకయాతన పడ్డాడు. చిరునవ్వుతో రాజా అని పిలిచే నిరతి పిలుపు, ఆమె నులివెచ్చని స్పర్శ, ఆమె వడ్డించే వేడి భోజనం, పడకగదిలో ఆమె గుసగుసగా చెప్పే కబుర్లు, ఆమె ఒంటినించి వచ్చే సువాసన.

ఆరునెలల దాంపత్యం అతనికి అనేక అనుభూతులు ఇచ్చింది. ప్రతీరాత్రి మనసు, దేహం ఆమె కోసం ఆక్రోశించినా అహంతో వాటిని అణిచేసాడు.

ఆ తర్వాత నిరతి అతనికి కనిపించలేదు.

నిరతితో రాజీపడమని ఒప్పించడానికి విఫల ప్రయత్నం చేసిన శ్రీనాథ్ ఆమెకి విడాకులివ్వమని కూడా నచ్చచెప్పలేకపోయాడు. క్రమంగా అతనూ జగదీష్ జీవితంలోంచి తప్పుకున్నాడు.

'ఆర్ట్ ఆఫ్ డయింగ్' అంటే శ్రీనాథ్‌కి, నిరతికి క్షమాపణలు చెప్పడం అనుకున్నాడు జగదీష్.

పాపం నిరతికి విడకులివ్వకుండా అన్యాయం చేసాడు. తన వయసే. నలభై దాటాక వచ్చాక ఇంక పెళ్ళేం చేసుకుంటుంది?

శ్రీనాథ్ - తను ఎంత విసుక్కున్నా, ఇన్సల్ట్ చేసినా అంటిపెట్టుకుని ఉండేవాడు. పండగలకి వాళ్ళింటికి తీసుకెళ్ళేవాడు. ఎంత బాధ కలగకపోతే వాడు తనని వదిలేస్తాడు?

నిరతి ఎక్కడుందో తెలీదు కానీ శ్రీనాథ్ ఇల్లు తనకి తెలుసు.

రేపు పొద్దున్నే వెళ్ళాలి. వెళ్ళి వాడికి క్షమాపణ చెప్పాలి. ఈ చివరి రోజుల్లో వాడిని తన దగ్గరే ఉండమనాలి. నిరతి అడ్రస్ తెలుసేమో అడగాలి.

ఈ నిర్ణయానికి వచ్చాక జగదీష్ ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు.

కారు శ్రీనాథ్ ఇంటి సందు తిరిగాక జగదీష్‌కి ఆ ప్రాంతం పెద్దగా మారలేదు అనిపించింది. ఈ సందు చివరే తమ స్కూల్ ఉండేది. లంచ్ టైంలో శ్రీనాథ్ ఇంటికివచ్చి అన్నం తిని వెళ్ళేవాడు చాలాసార్లు. తను వాడితో వాళ్ళింటికి వెళ్ళాడు. ఇంటర్‌లో చేరాక రావడం తగ్గింది. ఇంజనీరింగ్‌లో చేరాక కాలేజ్‌లు వేరై అసలు ఇక్కడికి రాలేదు.

శ్రీనాథ్ వాళ్ళది చిన్న డాబా ఇల్లు. రంగులు మినహా మార్పేమీ లేదు. గేట్ తెరచుకుని లోపలకి వెళ్ళి బెల్ నొక్కాడు.

తలుపు తీసిన పధ్నాలుగు, పదిహేనేళ్ళ అమ్మాయిని చూసి నిర్ఘాంతపోయాడు. అచ్చం ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌కి వచ్చిన నిరతిలాగే ఉంది.

ప్రశ్నార్థకంగా చూసిన ఆ అమ్మాయి ఓ క్షణంలో పోల్చుకుని అడిగింది.

"మీరు జగదీష్ గారు కదా? రండి. నాన్న ఇంట్లోనే ఉన్నారు... నాన్నా" పిలిచింది.

జగదీష్ అయోమయావస్థలో లోపలకి అడుగుపెట్టాడు. హాల్లోకి వచ్చిన శ్రీనాథ్ జగదీష్‌ని చూసి నివ్వెరబోయాడు.

"జగ్గీ నువ్వేనా? ఎలా ఉన్నావురా? ఈ రోజు మా ఇంటికి వచ్చావు అంటే, మాకు పండగే" ఆప్యాయంగా మిత్రుడ్ని ఆలింగనం చేసుకున్నాడు.

ఆ మాటలకి జగదీష్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. హాల్లో జగదీష్, శ్రీనాథ్ కలిసి తీయించుకున్న పెద్ద ఫోటో గోడకి వేలాడుతోంది. అదొక్కటే తప్ప ఆ గదిలో మరే ఫోటోలేదు.

"అమ్మా! అమ్మని పిలు" శ్రీనాథ్ ఆ అమ్మాయితో చెప్పాడు.

తర్వాత జగదీష్‌తో తడబడుతూ చెప్పాడు.

"జగ్గీ నువ్వు నన్ను క్షమించాలిరా. నేను నిరతిని పెళ్ళిచేసుకున్నాను. ఐ మీన్. లోకానికి అలా చెప్తున్నాం. కానీ నువ్వు విడాకులివ్వలేదుగా. సహజీవనమే. అందుకు కారణం కూడా వుంది."

జగదీష్ సోఫాలో వెనక్కి జారగిలపడ్డాడు. అతని మనసు విలవిల్లాడింది. తాను క్షమాపణ వేడుకోవాలని వస్తే, స్నేహితుడు క్షమించమని అడుగుతున్నాడు. తన నిరతిని వీడు దొంగతనం చేసాడు.

మంచినీళ్ళ గ్లాస్‌తో వచ్చిన నిరతి దాన్ని అతని ముందు టీపాయ్ మీద పెట్టి అడిగింది.

"బాగున్నారా?"

కాలం కొన్ని మొహమాటాలని, వయసు కొన్ని సంకోచాలని తగ్గిస్తుంది.

జగదీష్ ఆమె వంకే చూస్తూండిపోయాడు. వయసు పెద్ద మార్పులని తీసుకురాలేదు. అదే అందం. అదే నిర్మలత్వం. చీరలో ఉంది.

"ఈ రోజు సెలవు పెడదాం." శ్రీనాథ్ ఆమెతో చెప్పాడు. తలాడించి చెప్పింది.

"కీస్ నా దగ్గరే ఉన్నాయి. వెళ్ళి ఇచ్చి లీవ్ పెట్టివస్తా. వచ్చి వంట చేస్తా."

ఆ మాటతో తనని భోజనానికి ఉండమంటోందని జగదీష్‌కి అర్ధమైంది.

"సరే నేను కాల్ చేసి చెప్పేస్తా" శ్రీనాథ్ ఫోన్ తీసుకున్నాడు.

ఐదు నిమిషాల్లో వారిద్దరికీ కాఫీ ఇచ్చి నిరతి బయటకి నడిచింది.

మరో ఐదు నిమిషాల్లో ఆ అమ్మాయి బాక్‌పేక్ తో వచ్చి శ్రీనాథ్‌కి చెప్పింది.

"నాన్నా. కాలేజ్‌కి వెళ్ళొస్తా"

"ఒక్క నిమిషం తల్లి. జగ్గీ ఈ బంగారం తల్లి కుముద" శ్రీనాథ్ ఆమెని మిత్రుడికి పరిచయం చేసాడు.

జగదీష్ విస్మయంగా చూసాడు.

కుముద! తన తల్లిపేరు. వీళ్ళమ్మాయికి ఎందుకు పెట్టారు?

"మీరు నాకు తెలుసు. నాన్న రోజుకోసారైనా చెప్తారు. మీరే ఆయన్ని చదివించారట. చిన్నప్పుడు మీ జామచెట్టు మీదే ఉండేవారట నాన్న" కుముద నవ్వుతూ చెప్పింది.

జగదీష్ కూడా బలవంతంగా నవ్వాడు.

"వెళ్ళొస్తానండీ" చెప్పి కుముద వెళ్ళిపోయింది.

శ్రీనాథ్ తలుపు మూసి, వచ్చి జగదీష్ పక్కన కూర్చున్నాడు. అతని చేతిని పట్టుకుని చెప్పాడు.

"జగ్గీ! కుముద నీ కూతురే"

జగదీష్ ఉలిక్కిపడ్డాడు.

"ఏమిటి?"

"అవును. నిరతి ఆ రోజు ఆవేశంగా బయటకి వచ్చేసింది. తర్వాత పదిపదిహేను రోజులకి ఆమెకి ప్రెగ్నెంట్ అని తెలిసింది. ఏం చేయాలో తోచక నాకు కబురు చేసింది. నేను నీ దగ్గరకి వచ్చి ఎంత నచ్చచెప్పబోయినా నువ్వు ఒప్పుకోలేదు. ఇంక చేసేది లేక బిడ్డని కన్నది. ఇంజనీరింగ్ కెరీర్‌ని వదిలేసి బేంక్ టెస్ట్‌లు రాసి ఆఫీసర్‌గా సెలక్టయింది. కుముదని వాళ్ళ అన్నయ్య వాళ్ళే చూసుకునేవారు. నేను తరచూ వెళ్ళి చూసి వచ్చేవాడిని. ఆ తర్వాత దాదాపు అయిదేళ్ళకి ఆమెని ఒప్పించగలిగాను. భార్యాభర్తలుగా కలిసి బతుకుతున్నాం"

జగదీష్‌కి కళ్ళు తిరిగినట్లయింది. తమాయించుకుని రెండు నిమిషాలు కళ్ళు మూసుకుని ఉండిపోయాడు.

కుముద తన కూతురా? ఐనా శ్రీనాథ్ 'బంగారుతల్లి' అని ప్రేమగా చూసుకుంటున్నాడా?

తనెంత మూర్ఖంగా తమ మధ్య పిల్లలు కూడా ఉండడానికి లేదని శాసించాడు.

"ముందే చెప్పాల్సింది. సరిగ్గా చూడలేదు" గొణిగాడు.

"తనముందే ఎలా చెప్పను? సాయంత్రం వస్తుందిగా. కబుర్లు కూడా చెప్పచ్చు. కాకపోతే ఈ రహస్యం మాత్రం బయటపెట్టకు జగ్గీ" ప్రాధేయపూర్వకంగా చెప్పాడు.

కర్టెన్ కదిలింది. దాన్ని పట్టుకున్న చిన్న చేతుల తాలూకు ఆసామి తొంగి తొంగి చూస్తున్నాడు.

"ఓరోరి! నిద్రలేచావా? జొరం తగ్గిపోయిందా బుల్లి రాజుగారికి" శ్రీనాథ్ లేచి వెళ్ళి సిగ్గుపడే ఆ పిల్లవాడిని ఎత్తుకొచ్చాడు.

"వీడు మా రెండోవాడు. బంగారంకి, వీడికి పదేళ్ళు తేడా. యు.కెజి. జ్వరం వచ్చిందని స్కూల్ ఎగ్గొట్టాడు" వాడిని ఒళ్ళో కూర్చోపెట్టుకుంటూ చెప్పాడు.

"నీ పేరేంటి?" షాక్‌లకి అలవాటు పడ్డ జగదీష్ వాడి చెయ్యి పట్టుకుని అడిగాడు.

"రాజా" వాడూ సిగ్గుగా చెప్పాడు.

జగదీష్ ముఖంలోని భావాలని గమనించిన శ్రీనాథ్ మృదువుగా చెప్పాడు.

"నేను, నిరతి నిన్ను ప్రేమిస్తున్నాం జగ్గీ. రోజూ మా మధ్య నీ ప్రసక్తి రాకుండా ఉండదు. తాతయ్య పెంపకంలో నువ్వు మూర్ఖంగా తయారయ్యావని బాధ తప్పించి నీమీద మాకు కోపం లేదు. కాకపోతే నిరతి, నేను కూడా నీ ముందుకి రావడానికి సిగ్గుపడ్డాం. నీ పాపని గౌరవప్రదంగా పెంచడానికి, తనకో తండ్రిని ఇవ్వడానికే నేను నిరతి సహజీవనం చేస్తున్నాం. అందరికీ మేం రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నామని చెప్పాం. ఎవరూ ఆరాలు తీయలేదు."

జగదీష్ కన్నీళ్ళు తుడుచుకున్నాడు. తనలోని ఆ స్పందనకి అతనికి ఆశ్చర్యం వేసింది.

తలుపు తీసుకుని వచ్చిన నిరతి మృదువుగా చెప్పింది.

"అరగంటలో వంట చేసేస్తాను."

"తొందరేంలేదు. మేం మాట్లాడుకుంటున్నాం" శ్రీనాథ్ చెప్పాడు.

అతను చెప్పే చిన్నప్పటి విశేషాలు చాలావరకు జగదీష్‌కి గుర్తులేవు. ఎక్కువగా శ్రీనాథే మాట్లాడాడు.

వేడి భోజనం గతాన్ని గుర్తు తెచ్చింది. నిరతి రాజాకి అన్నం తినిపిస్తూ తగ్గు స్వరంతో కబుర్లు చెప్తోంది. శ్రీనాథ్ టేబుల్ సర్దుతున్నాడు.

'ఈ స్వర్గం నాది. నేను పారేసుకున్నది' జగదీష్ మనసు విలవిల్లాడింది. అతనికి గుండె పట్టేసినట్లుగా ఉంది. అప్పుడే ప్రాణం పోతుందేమో అని భయపడ్డాడు. ప్రాణం పోతుందని కాదు. వాళ్ళింట్లో పోతానేమోనని.

"మీరు ఆరోగ్యంగా కనిపించడంలేదు. ఓసారి చెకప్ చేయించుకోండి" నిరతి కాఫీ కప్ అందిస్తూ చెప్పింది.

అతని కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. ఇంట్లో ఉన్నప్పుడు లంచ్ తర్వాత కాఫీ తాగడం అతనికి ఇష్టం.

"బాగాలేను. నిజమే" గొణిగాడు.

తను ఇంటికి వెళ్ళేలోగా కుముద వస్తుందని ఎదురుచూసాడు కానీ రాలేదు.

బయలుదేరేముందు ఇద్దరి చేతులూ పట్టుకుని గద్గదంగా చెప్పాడు.

"మీ ఇద్దరి విషయంలో చాలా కఠినంగా ప్రవర్తించాను. నన్ను క్షమించండి. ముఖ్యంగా నిరతీ నువ్వు."

"అయ్యో! అదేం మాట మీరూ మమ్మల్ని క్షమించాలి" నిరతి చెప్పింది.

"మనమధ్య క్షమాపణలు ఏంటి జగ్గీ. నా జీవితమంతా నువ్వు పెట్టిన భిక్షే. అందుకు నీకు ఎప్పటికీ కృతజ్ఞుడ్నే" శ్రీనాథ్ నిరతి వంక ఓసారి చూసి చెప్పాడు.

ఆ రాత్రి జగదీష్ నిద్రలోనే ప్రశాంతంగా మరణించాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments